సాక్షి ఖమ్మం

సోమవారం ♦ 21 ♦ అక్టోబర్ ♦ 2024



ఈ రకాలు అయితేనే..

సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఆయా రకాల ధాన్యం వివరాలు వెల్లడించింది. 10లో



'ఇందిరమ్మ' నమూనాలు రెడీ

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా కమిటీలు వేస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
$31^{\circ} / 23^{\circ}$

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై, అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు దిశ సమావేశం

ఖమ్మం సహకారనగర్ : కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. దిశ కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సభ్యులు, ఆహ్వానితులు సకాలంలో హాజరు కావాలని కోరారు. జెడ్పీ, మండల ప్రత్యేకాధికారులు, జెడ్పీ సీఈఓ, డీఆర్డీఓ తదితర అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని ఆదేశించారు.

ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: టీజీఎప్‌సెట్ – 2024 ద్వారా బి.ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు సోమవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు నగరంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

ఖమ్మం సహకారనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 21 నుంచి 28 వరకు సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ-1) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2న జవాబు పత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలు ప్రకటిస్తామని, 5న ఆన్‌లైన్‌లో విద్యార్థుల మార్కులు అప్‌లోడ్ చేస్తామని వివరించారు. నవంబర్ 16న తల్లిదండ్రులు, టీచర్లతో సమావేశం నిర్వహించి విద్యార్థుల మార్కులు, వారి పనితీరుపై చర్చిస్తామని పేర్కొన్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని గుర్రాలపాడు జీఆర్‌ఆర్ జిన్నింగ్ మిల్ ఇండస్ట్రీస్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్వహించే పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభిస్తారని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఇతర జిల్లా అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు పండించిన పత్తిని జిన్నింగ్ మిల్లుల్లో విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని కోరారు.

నిధుల్లేక సుస్తీ!

జిల్లా పెద్దాస్పత్రిని వేధిస్తున్న ఆర్థిక ఇబ్బందులు

- హెచ్‌డీఎస్, ఆరోగ్యశ్రీ నిధులు రాక అవస్థలు
- మందుల కొనుగోలు, స్టేషనరీ ఖర్చులకూ చాలని దైన్యం
- ఆదాయ మార్గాలు ఉన్నా వినియోగించుకోలేని దుస్థితి



ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని నిధుల కొరత వేధిస్తోంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వెళ్లిన తర్వాత నిధుల విడుదల తగ్గిపోవడంతో ఆస్పత్రి నిర్వహణ కష్టంగా మారింది. రోజువారీ స్టేషనరీ ఖర్చులు కూడా వెళ్లక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో ఆస్పత్రి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. డబ్బుల్లేక చిన్నపాటి మరమ్మతులు కూడా చేయించలేకపోతున్నారు. హైదరాబాద్ తర్వాత ఎక్కువ సంఖ్యలో పేషెంట్లు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుంటారు. చుట్టుపక్కల జిల్లాల ప్రజలు ఎంతో కాలంగా ఇక్కడికే వైద్య సేవలకు వస్తుండటంతో ఈ ఆస్పత్రిపై తీవ్ర భారం పడుతోంది. సేవలు బాగుంటున్నాయని పేరు రావడంతో పలువురు పేదలు హైదరాబాద్ వెళ్లకుండా ఇక్కడికి వచ్చేందుకే మొగ్గు చూపుతున్నారు. ఇలా నిత్యం 1500 నుంచి 2వేల మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల ఆస్పత్రి ప్రస్తుతం నిధుల కొరతతో నీరసిస్తోంది. ఇక్కడి అధికారులు ఏ చిన్న పని చేయాలన్నా ఉన్నతాధికారులకు విన్నవించాల్సి వస్తోంది.

కొనుగోళ్లు, పరికరాల మరమ్మతుల్లో జాప్యం..

గతంలో పెద్దాస్పత్రికి హెచ్‌డీఎస్ నిధులను ప్రభుత్వం తరచూ విడుదల చేసేది. అయితే ఈ ఆస్పత్రి గతేడాది నవంబర్‌లో వైద్య విద్య పరిధిలోకి వెళ్లింది. దీంతో అప్పటి నుంచి నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. కేస్ షీట్లు, ఓపీ స్లిప్పులు, ఇతర పేపర్లు, పెన్నులు, ప్రింటర్ల నిర్వహణ తదితర స్టేషనరీ అవసరాలకు నెలకు రూ. 2 లక్షలకు పైగా ఖర్చవుతోంది. టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ మందులు సరఫరా చేస్తున్నా.. కొన్ని సమయాల్లో అత్యవసర మందులు అందుబాటులో లేక బయట నుంచి కొనుగోలు చేస్తారు. అలాగే ఐసీయూ, క్యాథ్‌ల్యాబ్, క్యాజువాలిటీ వంటి విభాగాల్లో అవసరమైన అత్యవసర మందులు కూడా డిస్ట్రిబ్యూటర్ల నుంచి తెప్పిస్తారు. నిధుల కొరతతో పరికరాలు మరమ్మతులకు గురైనా చేయించలేని దుస్థితి ఏర్పడింది. విద్యుత్ సరఫరా చేసే కేబుల్‌లో సమస్య ఏర్పడి నాలుగు రోజులుగా ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలు నిలిచిపోయాయి. కేబుల్ మార్చాల్సి రాగా దాని ఖరీదు రూ. 3.50 లక్షల వరకు అవుతుందని ఇంజనీరింగ్ టెక్నీషియన్లు నిర్ధారించారు. దీంతో నిధులు లేక, ఏం చేయాలో తెలియక అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఇక ఆస్పత్రిలో కీలకమైన సీటీస్కాన్ సేవలు లేక బాధితులు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఆగిన ఆరోగ్యశ్రీ బకాయిలు..

పెద్దాస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించడం ద్వారా వచ్చే నిధులు యేడాదిగా అందడం లేదు. ఈ మొత్తం బకాయిలు సుమారు రూ. 3.50 కోట్లు విడుదల కావాల్సి ఉంది. దీంతో ఆరోగ్యశ్రీ నిధుల లేమితో అవసరాలు తీరని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నిధులు విడుదలైతే కనీస అవసరాలకు వినియోగించడంతో పాటు వైద్య సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లు చెల్లించొచ్చు. దీంతో వారు మరింత ఉత్సాహంగా పనిచేసే అవకాశం ఉంటుంది.

ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాం..



ప్రస్తుతం హెచ్‌డీఎస్ నిధులు చాలా తక్కువగా వస్తున్నాయి. ఆరోగ్యశ్రీ బకాయిలు యేడాదిగా విడుదల కావట్లేదు. రూ.3.50 కోట్లు విడుదలైతే చాలా సమస్యలు తీరుతాయి. ప్రస్తుతం ఇతర ఆదాయ మార్గాలపైనా దృష్టి సారించాం. క్యాంటీన్‌ను త్వరలో కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు కలెక్టర్ అనుమతి కోసం ఫైల్ పెట్టాం. పార్కింగ్ పైనా దృష్టి పెట్టాం. దీనిపై కూడా కలెక్టర్‌కు లెటర్ అందించాం.

– ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

ఆదాయ మార్గాలున్నా..

డీఎంఈ పరిధిలోకి వెళ్లిన తర్వాత నిధుల లేమితో ఆస్పత్రి నిర్వహణకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు జనరేటర్లకు, అంబులెన్స్‌ల నిర్వహణకు అవసరమైన డీజిల్ కొనుగోలుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి పెడితే కొంత మేర కష్టాలు తప్పే అవకాశం ఉంటుంది. ఆస్పత్రిలోని క్యాంటీన్‌ను సుమారు మూడు నెలల క్రితం మూసేశారు. నెల వారీ అద్దె బకాయిలు పేరుకుపోవడంతో అధికారులు సదరు కాంట్రాక్ట్ రద్దు చేశారు. ప్రతీ నెల క్యాంటీన్ ద్వారా రూ.4.20 లక్షల అద్దె చెల్లించే వారు.



మూతబడిన క్యాంటీన్

ప్రస్తుతం రూ.12 లక్షలకు పైగా ఆదాయం నిలిచిపోయింది. వెంటనే టెండర్లు పిలిచి క్యాంటీన్‌ను కొనసాగిస్తే కొంత మేర ఇబ్బందులు తప్పే అవకాశం ఉంటుంది. వాహనాల పార్కింగ్ ద్వారా అతి తక్కువగా నెలకు రూ.16వేల ఆదాయం మాత్రమే వస్తోంది. చాలా ఏళ్ల క్రితం దివ్యాంగుల గ్రూపునకు పార్కింగ్ నిర్వహణ ఇచ్చారు. అయితే ప్రస్తుతం కొత్తగా పార్కింగ్ నిర్వహణకు టెండర్ పిలిస్తే రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. ఈ దిశగా అధికారులు ఆలోచిస్తే ఆదాయ మార్గాలు పెరిగి నిర్వహణకు ఇబ్బందులు తప్పుతాయని ఆస్పత్రి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అందరికీ అండగా ఉంటాం

- విలీన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం
- అర్హులందరికీ వరద సాయం
- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఖమ్మంవన్‌టౌన్: తమను నమ్ముకున్న వారందరికీ న్యాయం చేసేలా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తామని, వారికి అండగా నిలుస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని 16వ డివిజన్‌లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.1.95 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలు, విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తామన్నారు. నగరంలోని ఖాళీ స్థలాలలో నీరు నిల్వడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నీరు నిల్వ ఉండకుండా సంబంధిత యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని, స్పందించకుంటే నోటీసులు జారీ చేయాలని కేఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. కొందరు వరద బాధితులకు పరిహారం అందలేదని దరఖాస్తులు వచ్చాయని, నిజంగా ముంపునకు గురైన వారందరికీ పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎగనామం పెట్టిన రైతుబంధు సొమ్ము తాము ఇటీవల చెల్లించామని, అధికారంలో ఉన్నప్పుడు రైతుల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ వారు నేడు మొసలి కన్నీరు కారుస్తూ ధర్నా చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. దీపావళి నుంచి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ప్రజా ప్రభుత్వంలో మొదటి ఏడాది రైతులకు దాదాపు రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ.. 16వ డివిజన్‌లో దాదాపు 1,500 కుటుంబాలకు వరద పరిహారం అందించామని, పెండింగ్‌లో ఉన్నవారికి వారం రోజులల్లో అందిస్తామని అన్నారు. జాబితాలో పేర్లు లేని కుటుంబాల కోసం సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ గణేష్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, పాలెపు వెంకటరమణ, మందడపు మనోహర్, మందడపు బ్రహ్మారెడ్డి, వడ్డెబోయిన నర్సింహారావు, పుచ్చకాయల వీరభద్రం, చోటేబాబా, పాలకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో తుమ్మల పర్యటన..

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 9.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఏపీలోని గుంటూరు వెళ్తారు.

వృథా కాదు మీ త్యాగం..

నేడు పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవం

ఖమ్మంక్రైం : దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తుంటారు. గత కొన్ని సంవత్సరాలుగా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ సర్దార్ పటేల్ జయంతి రోజున జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహిస్తున్నారు.

జవాన్ల త్యాగానికి గుర్తుగా..

1959 అక్టోబర్ 21 సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ కరమ్ సింగ్ అధ్వర్యంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యులు దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా చైనా రక్షణ బలగాలు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా సీఆర్పీఎఫ్ దళం ఎదురొడ్డి పోరాడింది. ఈ క్రమంలో 10 మంది భారత జవాన్లు మృతిచెందారు. వారి త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తుంటారు.



పోలీస్ అమరవీరుల స్థూపం

31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు...

నేటి నుంచి ఈనెల 31 వరకు పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం ఖమ్మంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పరేడ్ గ్రౌండ్స్ స్మారక స్థూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా పోలీస్ విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ తదితర విషయాలను ప్రజలకు వివరించనున్నారు.

3న ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి

ఖమ్మం సహకారనగర్ : కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 3న జిల్లా సకల ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 3వ తేదీ ఉదయం 8 గంటల నుంచి గొల్లగూడెం రోడ్‌లోని చెరుకూరి వారి మామిడితోటలో వన సమారాధన కార్యక్రమం ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ తదితర ఉద్యోగులతో పాటు జర్నలిస్టులు కూడా కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు.



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు, పక్కన ఉద్యోగ సంఘాల నాయకులు

ఉదయం శివపార్వతులకు, ఉసిరిచెట్టుకు పూజతో ప్రారంభమై ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, రేణుకాచౌదరి తదితరులు హాజరవుతారని వివరించారు. వీరందరినీ సన్మానిస్తామని తెలిపారు. సమావేశంలో టీఎన్జీవోస్ కో కన్వీనర్ కొణిదన శ్రీనివాస్, టీజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వి. నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సిలార్, ఎంపీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల రవీంద్రప్రసాద్, పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా సభలకు ముస్తాబు..

నేడు కొత్తగూడెంలో ప్రారంభంకానున్న రాష్ట్ర మహాసభలు

సింగరేణి(కొత్తగూడెం): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర నాలుగో మహాసభలకు కొత్తగూడెం ముస్తాబైంది. జెండాలు, తోరణాలతో పట్టణంలోని ప్రధాన కూడళ్లను అలంకరించారు. సభలు సోమవారం ప్రారంభంకానుండగా రాష్ట్రవ్యాప్తంగా 600 మంది ప్రతినిధులు తరలిరానున్నారు. 21న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా అనేక మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించిన రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె. శ్రీమతి, కార్యదర్శి మరియం ధావలే సభలకు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో మహిళల మీద జరుగుతున్న హింస, వేధింపులు, కేంద్ర ప్రభుత్వ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన పోరాటాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని నిర్వాహకులు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులతో వివిధ రకాల కమిటీలు ఏర్పాటు చేసుకుని వసతులు, ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహణ, భోజనాలు, ప్రతినిధుల సభలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు మహాసభలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

పాఠశాలల క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–14, 17 ఖోఖో, బాస్కెట్‌బాల్, చెస్ క్రీడా జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను నిర్ణీత తేదీల్లో అయా జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని జిల్లా పాఠశాలల క్రీడల సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. ఈ ఎంపికల ప్రక్రియలో సీనియర్ పీడీ ఎండీ షఫీక్ అహ్మద్, పీవీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

అండర్–14 ఖోఖో జట్టుకు జి.నిఖిల్, ఎ.అజయ్‌కుమార్, ఈ.మహేష్, హర్షవర్ధన్, సాత్విక్, రోహిత్, శ్రీరామ్, దిలీప్, వివేక్, నిహాన్, దినేష్, గోపీచంద్, ఎస్.కె.ఫరీదా, వెంకటలక్ష్మి, రాధిక, ఎం.భార్గవి, ఆర్. శరణ్య, జి.పూజ, దీక్షిత, రేష్మ, మేఘన, జయశ్రీ, లావణ్య ఎంపికయ్యారు. అండర్–17 జట్టులో వి.చైతన్య, దుర్గాభవాని, మహాలక్ష్మి, భవాని, మాధూరి, భార్గవి, అనిషా, అనుపమ, ఇందు, అకివెళ్ల సాయి, అఖిలసాయి, రమాదేవి, తేజశ్రీ.జి.సాయి సిద్ధార్థ, మహేంద్రనాయక్, ప్రవీణ్‌కుమార్,, యువన్‌తేజ, రుషి, అభిలాష్, చంద్ర, జావిద్, గణేష్, సాయిచరణ్, ధనుష్, సాయి ఎంపికయ్యారు.

బాస్కెట్‌బాల్‌లో..

అండర్ –14 బాసెకెట్ బాల్ జట్టుకు ఎండీ అబిద్, కె.వినయ్, టి.సిద్దు, ఎం.చేతన్, ఎస్.కె.అయాన్, స్నేహిత్, ఎస్.కె.ఖాదర్, ఎం.హర్షవర్ధన్, వెంకటచైతన్య, కి.చరణ్‌సాయిరామ్, లోహిత్ అక్షయ్, బి.అవంతిక, కీర్తి, స్వప్నిక, ఉపేక్ష, ఎం.డీ అఫ్రీన్, ఎ.రమ్యశ్రీ, బి.జీవనశ్రీ, ఎం.అర్థయ, ఎం.దీక్షిత, పి.కార్తీక, తన్మయి, అండర్ –17 జట్టులో జయంత్, సూర్యాశ్వర్, వి.తమస్, కె.చరణ్‌నాయుడు, డి.గౌతమ్‌సాహూ, ఎం.జాన్, పి.సాయికౌశిక్, వి.సాత్విక్, జి.హతిష్‌సాయి, ఎం.డి. గౌస్ అస్లిం, జి.అవిగ్నేష్, ఎం.డి. రిమ్‌షా, అఖిల, జ్యోషిత, హనోయ్, అయిపాని, సీత్‌శీతల్, చందన, కారుణ్యసాయి, చరిత, దీక్షిత, జి.రష్మీ, శ్రీదర్శిని ఎంపికయ్యారు.

చెస్ జట్టులో..

అండర్–14, 17 చెస్ బాలబాలికల జట్టులో హిమశ్రీనిక, లక్ష్మిసహస్ర, మహాలక్ష్మి, శ్రీహర్షిత, సత్యప్రణవ్, రుత్విక్, సిద్ధు, సాయి, విఘ్నేష్, కార్తీక్, పి.సుధారాణి, వర్షిత, శ్రీకళ, పల్లవి, మేఘన ఉన్నారు.

చెత్తపై సమరం..





ఖాళీ స్థలంలో మట్టి నింపుతున్న దృశ్యం (ఇన్‌సెట్) బయోమైనింగ్ యంత్రం

- డంపింగ్ యార్డ్‌లో ఏరోజుకారోజే శుభ్రం
- కొనసాగనున్న బయోమైనింగ్
- వ్యర్థాలతో బయో గ్యాస్ తయారీకి ప్రణాళిక
- కంపెనీల ప్రతినిధులతో కేఎంసీ అధికారుల మంతనాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న చెత్త సమస్య ఆమోదయోగ్యమైన పరిష్కారం వైపు అడుగులు వేస్తోంది. కొన్నేళ్లుగా దానవాయిగూడెంలోని డంపింగ్ యార్డు సమస్య స్థానికులకు నిద్ర లేకుండా చేస్తోంది. మరోవైపు కార్పొరేషన్ అధికారులు కూడా ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియక తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యాన డంపింగ్ యార్డుతో స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన, పొగ రాకుండా ఏ రోజు చెత్తను ఆ రోజే శుభ్రం చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పుణె, ఇండోర్ వంటి నగరాల్లో చెత్తను ఏరోజుకారోజు శుభ్రం చేసే కంపెనీలతో అధికారులు మంతనాలు జరుపుతున్నారు.

వేరు చేసి.. తరలించి..

ఖమ్మం నగర పాలక సంస్థలో రోజుకు 200 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిలో 120 మెట్రిక్ టన్నులు తడిచెత్త కాగా.. 80 మెట్రిక్ టన్నులు పొడి చెత్త. వీటిని డంప్ చేసి బయోమైనింగ్ చేయడం తలనొప్పిగా మారింది. దీంతో అధికారులు ఇతర మార్గాల వైపు దృష్టి సారించారు. పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగైన నగరంగా ఉన్న పుణెలో చెత్త నిర్వహణ ఎలా చేస్తున్నారనే దానిపై అధికారులు పరిశీలించి, అక్కడి విధానాలను ఇక్కడ అమలు చేసేలా చర్యలకు ఉపక్రమించారు. ఏ రోజు చెత్తను ఆరోజే వేరు చేసి తడిచెత్తను సేంద్రియ ఎరువుకు, బయోగ్యాస్‌కు ఉపయోగించడం, పొడి వ్యర్థాల్లో ఉండే ప్లాస్టిక్, మట్టి, రాళ్లు వేరు చేసి.. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌కు, మట్టి, రాళ్లను లోతట్టు ప్రాంతాలకు తరలించనున్నారు.

రూ.25 కోట్లతో ప్రాజెక్ట్..

ఏరోజుకారోజు చెత్తను వేరు చేసి బయటకు తరలించే విధానాన్ని పూణె, ఇండోర్ నగరాల్లో అవలంబిస్తున్నారు. ఈ ప్రక్రియను ఎకో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తోంది. ఖమ్మంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చిన అధికారులు.. నగరంలో రోజు వారీగా సేకరించే వ్యర్థాలు, డంపింగ్‌యార్డు స్థలం, అక్కడ ఉన్న వసతులు, సౌకర్యాలను సంబంధిత ఏజెన్సీకి వివరించినట్లు సమాచారం. దీంతో ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు రూ.25 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారానికి నిధులు కేటాయిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన నేపథ్యంలో అధికారులు ఏజెన్సీకి డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిసింది. ఇప్పటికే డీయూఎఫ్‌ఐడీసీ నిధుల నుంచి రూ.12 కోట్లు, ఇతర గ్రాంట్ల నుంచి రూ.13 కోట్లు ఈ ప్రాజెక్టుకు కేటాయించనున్నట్లు సమాచారం. ఇక బయోగ్యాస్ తయారీపై కూడా అధికారులు ఆలోచిస్తున్నారు. తడి చెత్తతో బయోగ్యాస్ తయారీ ప్రక్రియను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టేందుకు అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం తడిచెత్తను విడిగా సేకరించి డంపింగ్‌యార్డులో ఓ పక్కన పెద్ద కుప్పలా పోసి కవర్లతో కప్పనున్నారు. ఈప్రక్రియ ద్వారా సేంద్రియ ఎరువుతోపాటు బయోగ్యాస్ కూడా ఉత్పత్తి చేయొచ్చనే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

కొనసాగనున్న బయోమైనింగ్..

డంపింగ్‌యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్ చేసే ప్రక్రియ ఇక ముందు కూడా కొనసాగనుంది. డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన 2 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేయనున్నారు. 36 ఎకరాల స్థలంలో పేరుకుపోయిన వ్యర్థాల్లో ఇప్పటి వరకు 8 ఎకరాలకు పైగా స్థలంలోని వ్యర్థాలను శుభ్రం చేశారు. ఈ ఎనిమిది ఎకరాలను కేఎంసీకి అప్పగించడంతో ఇక్కడ మొక్కలు నాటి పార్కును ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మిగిలిన 28 ఎకరాలను కూడా శుభ్రం చేసే వరకు బయోమైనింగ్ ప్రక్రియ కొనసాగించనున్నట్లు తెలిసింది. ఇక డంపింగ్‌యార్డు చుట్టూ మొక్కలు నాటడంతోపాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు.

శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక



డంపింగ్ యార్డ్‌తో తలెత్తుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాం. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల ప్రకారం ఏ రోజు చెత్తను ఆ రోజే శుభ్రం చేసేందుకు ఏజెన్సీల నుంచి డీపీఆర్ కోరాం. త్వరలోనే ప్రాజెక్టును ప్రారంభించి వ్యర్థాల కుప్పలు లేకుండా చేస్తాం. ఉన్న వ్యర్థాలను బయోమైనింగ్‌ద్వారా శుభ్రం చేసే చర్యలను కొనసాగిస్తాం. ఖాళీ అయిన ఎనిమిది ఎకరాల స్థలంలో మొక్కలు నాటుతాం.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కళాఉత్సవ్‌కు ఎంపిక


ఎం.శ్రీజ

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎం. శ్రీజ హైదరాబాద్‌లో నవంబర్ 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ 2024కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పి.శాంతిసుధ ఆదివారం తెలిపారు. ఖమ్మం డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ 2024, జిల్లా సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శ్రీజ పాల్గొని 3డీ ఆర్ట్‌ఫాం విభాగంలో ప్రథమస్థానం పొంది.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి


వృద్ధుడి మృతదేహాన్ని తరలిస్తున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంక్రైం: నగరంలోని ఖమ్మం రైల్వేస్టేషన్ రెండో నంబర్ ప్లాట్ ఫాంపై గుర్తుతెలియని వృద్ధుడు (75) మృతిచెందగా రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. ఎస్‌ఐ భాస్కర్‌రావు అన్నం ట్రస్ట్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించగా ఆయన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన కిన్నెర శ్రీను (40) ఆదివారం తన పొలంలో విద్యుదాఘాతానికి గురై బావిలో పడి మృతిచెందాడు. శ్రీను తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అదుపుతప్పి వ్యవసాయ బావిలో పడిపోయాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించటంతో వారు వచ్చి శ్రీను మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● యువకుడు మృతి

తల్లాడ: మండలంలోని అంబేడ్కర్‌నగర్ గ్రామం వద్ద ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. మండలంలోని బిల్లుపాడుకు చెందిన నల్లగట్ల జయరాజు (35)పల్లిపాడుకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. జయరాజుకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేట వద్ద ఆదివారం అతివేగంగా వచ్చిన కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు కొత్తగూడెం నుంచి తల్లాడ వైపు వస్తున్న మోటార్ సైకిల్‌ను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న వైరాకు చెందిన బత్తుల మురళీకృష్ణ, జగ్గయ్యపేటకు చెందిన బత్తుల నరసింహారావు, బత్తుల ఉజ్వల్‌కు గాయాలయ్యాయి. మురళీకృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు.

మోపెడ్‌ను ఢీకొట్టిన బైక్


● ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

వేంసూరు: మండలంలోని కల్లూరుగూడెం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వీరప్రసాద్ కథనం ప్రకారం.. శంబునిగూడెం గ్రామానికి చెందిన పెద్దబోయిన జమలయ్య టీవీఎస్ మోపెడ్‌పై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారం ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా కల్లూరుగూడెం పంచాయితీ గొల్లగూడెం గ్రామానికి చెందిన చిలక గోపి (25), రాచూరి వంశీ బైక్‌పై గూడూరు వైపు వెళ్తూ జమలయ్య మోపెడ్‌ను వెనుకనుంచి ఢీకొట్టారు. చిలక గోపి రోడ్డు మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. జమలయ్య, వంశీకి తీవ్ర గాయాలు కాగా.. వారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ పేర్కొన్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు

వైరారూరల్: కొబ్బరి చెట్టుపై పిడుగు పడిన ఘటన మండలంలోని నారపునేనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో నారపునేనిపల్లిలోని శేఖర్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు లేచి కొబ్బరి చెట్టు స్వల్పంగా కాలిపోయింది. ఆ సయయంలో శేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండటంతో ప్రమాదం తప్పింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

ఇందిరమ్మ ఇళ్లకు నమూనాలు రెడీ

పథకం అమలుకు కమిటీల ఏర్పాటు

- వార్డుల వారీగా ఏడుగురు చొప్పున ఎంపిక
- కలెక్టర్ ఆమోదం అనంతరం బాధ్యతలు
- పలు దఫాల్లో ఇళ్ల కేటాయింపు


ఇందిరమ్మ ఇళ్లు (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. శాసన సభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నమూనాలు రూపొందించి అమలు చేసే ప్రక్రియను చేపట్టగా.. మొదటి దశలో రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు వెచ్చించేలా పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తు చేసుకున్న వాటిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా ఉంది. అర్హులైన వారికి దఫాల వారీగా ఎంపిక చేసి ఇళ్లను కేటాయించనున్నారు. ఈక్రమంలో ప్రతీ జిల్లాకు ప్రభుత్వం ఇప్పటికే ఓ నోడల్ అధికారిని నియమించగా.. ఖమ్మం జిల్లాకు బి.శ్రీనివాసరావును నియమితులయ్యారు.

వార్డుల వారీగా కమిటీలు..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం అమలును జీపీలు, మున్సిపాలిటీ వార్డుల వారీగా నిర్వహించాలని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు నిర్ణయించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానికులను కలుపుకొని ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందిరమ్మ కమిటీలో చైర్మన్‌గా జీపీ స్థాయిలో సర్పంచ్ లేదా గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వ్యవహరించనుండగా.. మున్సిపాలిటీల్లో వార్డ్ కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ వ్యవహరిస్తారు. ఈ రెండింటిలో సభ్యులుగా స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే ముగ్గురు సభ్యులు, వీరిలో కనీసం ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ లేదా ఎస్టీల నుంచి ఉండాలి. కమిటీ కన్వీనర్‌గా జీపీల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్ వ్యవహరిస్తారు.

రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు..?

జిల్లాలో 20 మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో, ఖమ్మం కార్పొరేషన్, మధిర, వైరా, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో డివిజన్లు, వార్డుల వారీగా కమిటీల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా వ్యాప్తంగా కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తికావొచ్చింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు గ్రామ పంచాయతీల ఇందిరమ్మ కమిటీలను, డివిజన్ల, వార్డుల కమిటీలను మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పర్యవేక్షణలో కలెక్టర్ కమిటీలకు అనుమతులు ఇవ్వడంతో పాటు పథకం అమలుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో రెండు, మూడు రోజుల్లో కమిటీలను కలెక్టర్ పరిశీలించి అధికారికంగా ఆయా కమిటీలకు బాధ్యతలను అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కమిటీల బాధ్యతలు..

- ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా భవన నిర్మాణంపై అవగాహన కలిగి ఉండాలి.
- ఇంటి నిర్మాణ బాధ్యతలను లబ్ధిదారుడికి అప్పగించాలి.
- ఇందిరమ్మ కమిటీ సోషల్ ఆడిట్ కమిటీగా కూడా వ్యవహరించాలి.
- గృహ నిర్మాణంలో అర్హత లేని వారు లబ్ధిదారులుగా ఉంటే సమాచారాన్ని సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాల్సి ఉంటుంది.

గ్రానైట్ పరిశ్రమలను కాపాడుకుంటా..


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే కూనంనేని, ఎమ్మెల్సీ మధు

- ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ, రాయితీలు ఇప్పించేందుకు కృషి
- జిల్లా గ్రానైట్ అసోసియేషన్ ప్రమాణస్వీకారంలో మంత్రి తుమ్మల

ఖమ్మంఅర్బన్: జిల్లాలో లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని అందించే గ్రానైట్ పరిశ్రమలను కాపాడుకుంటామని, అందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, సబ్సిడీలను అందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన గ్రానైట్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్వారీల లీజుల విషయంలో అనుమతులు సరళీకృతం చేసేందుకు, పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ, రాయల్టీలో 40 శాతం సబ్సిడీ ఇచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాతా మధు, విత్తన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతోపాటు సాధు రమేశ్‌రెడ్డి, పారా నాగేశ్వరరావు, వెంకటరమణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నున్నా నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కాగా, జిల్లా గ్రానైట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పాటిబండ్ల యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా కమర్తపు గోపాల్‌రావు, కోశాధికారిగా మారంరెడ్డి పరమేశ్వరరెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. దొడ్డా రాకేశ్, రఘురామిరెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, ఎం.కల్యాణ్‌కుమార్, సురేశ్, జి.శివారెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఎల్.సురేశ్, పి.స్వామి, వెంకటేశ్, రాము, తమ్మినేని సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'హాలికులు సేమమా?'

ఖమ్మంగాంధీచౌక్: అన్నదాతల ఆత్మహత్యలు, ఆక్రందనలకు అద్దం పట్టేలా 'హాలికులు సేమమా' నాటిక ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నెలనెలా వెన్నెల 87వ అభ్యుదయ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుల రామారావు, కొమ్ము ప్రసాద్ రచించి, కె.దేవేంద్ర దర్శకత్వం వహించిన 'హాలికులు సేమమా?'నాటికను ప్రదర్శించారు. 1987–88 కాలం నుంచి జరుగుతున్న పత్తి రైతుల ఆత్మహత్యలు, రైతాంగం అవహేళనకు గురవుతున్న తీరు, లంచగొండి అధికారగణం, కల్తీ వ్యాపారాలు, వడ్డీ వ్యాపారాలు, మార్కెటింగ్ వ్యవస్థ, రాజకీయాల తీరు, చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటున్న దోపిడీ వ్యవస్థ పర్యవసానంగా అన్నదాతల ఆత్మహత్యలు తదితర అంశాలను నాటికలో చూపారు. నాటిక ప్రదర్శనకు ముందుగా నిర్వహించిన సభకు నెలనెలా వెన్నెల నిర్వాహకులు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్) అధ్యక్షులు మోటమర్రి జగన్మోహన్‌రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్ నిర్వహించారు. నిర్మల్ హృదయ్ స్కూల్ కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి, బొమ్మ విద్యా సంస్థల చైర్మన్ బొమ్మా రాజేశ్వరరావు, సీపీఐఎం జిల్లా నాయకులు వై.విక్రమ్, ఆర్క్స్ కోశాధికారి కె.దేవేంద్ర, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబత్తిని రవి, వేల్పుల విజేత, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేటూరి సదానందం తదితరులు నెలనెలా వెన్నెల 87 కార్యక్రమాల వెనుక ఉన్న శ్రమను వివరిస్తూ, నాటిక ప్రాశస్త్యాన్ని వివరించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

పీఎం ఆవాస్ యోజన ఇళ్లపై ఆడిటింగ్


లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదలకు నిర్మించిన ఇళ్లపై ఆదివారం ప్రత్యేకంగా ఆడిటింగ్ నిర్వహించారు. నగర పరిధిలోని వైఎస్సార్‌నగర్‌లో నిర్మించిన 204 ఇండ్లు, మల్లెమడుగులో నిర్మించిన 106 ఇండ్లకు సంబంధించిన ఆడిటింగ్ ప్రక్రియను స్థానిక అధికారులతో కలిసి కేంద్ర బృందం నిర్వహించింది. ఆవాస్ యోజన పథకం కింద ఎంపిక చేసి ఇండ్లు అందించిన వారి వివరాలను సేకరించి ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల వివరాలు తెలుసుకొని పోర్టల్‌లో ఉన్న వివరాలతో సరిచూశారు. ఈ సందర్భంగా సమస్యలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేదల కోసం నిర్మించిన ఇండ్ల ఆడిటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌టీఎం సాయిజ్ఞానేందర్, ఎస్‌ఆర్‌పీ చెన్నకేశవులు, ఏపీసీ అంజగౌడ్, టీడబ్ల్యూఐడీ డీఈ బి.రాజు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ కె.లక్ష్మీనారాయణ, హౌసింగ్ సీఎల్‌టీసీ సిరాజ్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలి..


మాట్లాడుతున్న చంద్రశేఖర్

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో ఇండియా, గ్రామీణాభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో ఎస్బీఐ ఆర్సెటీ సహకారంతో వ్యాపార అభివృద్ధి నైపుణ్య శిక్షణ పొందిన దివ్యాంగులకు సరిఫికెట్లు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎస్బీఐ ఆర్సెటీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతం కావాలని, అందుకు ఎస్బీఐ ఆర్సెటీ నుంచి శిక్షణ ఇచ్చి, రుణాల కోసం దరఖాస్తులు సిఫార్సు చేస్తామని, విద్యార్థులు సొంతంగా ఎదిగేందుకు సాయం చేస్తామని తెలిపారు. ఎనేబుల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మేనేజర్ కొత్త మల్లికార్జున్ మాట్లాడుతూ.. వ్యాపార అభివృద్ధిలో దివ్యాంగులు ఎదగటానికి కావాల్సిన సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాంబాబు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు


మాట్లాడుతున్న గరికె ఉపేందర్‌రావు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న రెవెన్యూ చట్టం భూమాతతోనే రాష్ట్ర ప్రజలకు, 70 లక్షల మంది రైతులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు తెలిపారు. ఆదివారం నగరంలోని ఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరగగా ముఖ్య అతిథిగా హాజరైన ఉపేందర్‌రావు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోనే పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు, వీఆర్వోలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ధరణి పోర్టల్‌తో రాష్ట్రంలోని 50 లక్షల మంది రైతులు బాధితులుగా మారారని తెలిపారు. ఉద్యోగ భద్రత లేక తీవ్ర మానసిక వేదనతో 178 మంది వీఆర్వోలు మృతిచెందారని, ఇవన్నీ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితమేనని స్పష్టం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డికి సమర్పించారు. నాయకులు సున్నం రామారావు, ప్రసాద్, వి.రామారావు, నాగేంద్రబాబు, ఎస్‌కే సుభాని, లక్ష్మీనర్సుకృష్ణ, ఎలమంద వరలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటరమణ, మేడికొండ బాలయ్య, బండ కృష్ణయ్య, చర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


భూక్యా శారద (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడులో పిడుగుపాటుకు గురై నలుగురు మహిళలు గాయపడగా ఓ మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన భూక్యా శారద (38) తన కూతురు దేవి, ధరవత్ జీజా, సరోజతో కలిసి తన మిర్చి తోటలో కలుపు తీస్తుండగా ఈ నెల 19న మధ్యాహ్నం పిడుగుపడింది. దీంతో నలుగురూ అస్వస్థతకు గురికావడంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో శారద పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. మృతురాలికి భర్త శంకర్, ఇద్దరు కుమార్తెలు. ఓ కుమార్తె వివాహం కాగా దేవి ఇంటర్ చదువుతోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నాగేశ్వరరావును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పిడుగుపాటుతో వ్యక్తికి గాయాలు

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మడుపల్లి నాగేశ్వరరావు ఆదివారం తన వ్యవసాయ భూమిలో కూలీలతో పత్తి తీస్తుండగా సమీపంలో పిడుగుపడింది. నాగేశ్వరరావు అక్కడికక్కడే కుప్పకూలాడు. కూలీలు, చుట్టుపక్కల రైతులు ప్రథమ చికిత్స చేయించి ఆటోలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కాల్వలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం


ప్రియాంకకు చికిత్స అందిస్తున్న వైద్యులు

నేలకొండపల్లి: కాల్వలో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా స్థానికులు కాపాడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కోరట్లగూడెం గ్రామానికి చెందిన వివాహిత బచ్చలకూరి ప్రియాంక (35) మండల కేంద్రంలో ఓ హోటల్‌లో పనిచేస్తోంది. దంపతుల మధ్య గొడవల కారణంగా ప్రస్తుతం పిల్లలతో కలిసి కోదాడలో నివాసం ఉంటోంది. రోజూ హోటల్‌లో పని చేసేందుకు నేలకొండపల్లి వస్తుంది. ఆదివారం నందిగామ బ్రాంచ్ కెనాల్ వద్దనున్న బ్రిడ్జి పైనుంచి స్థానికులు వారిస్తున్నప్పటికీ వినిపించుకోకుండా కాల్వలోకి దూకింది. ఇద్దరు యువకులు కాల్వలోకి దూకి బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించగా.. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో సాధ్యం కాలేదు. గ్రామస్తులు తాడు సాయంతో బయటకు తీశారు. మరి కొద్ది దూరంలోనే పవర్ ప్లాంట్ లాక్‌లు ఉన్నాయి. స్థానికులు కాపాడకపోయి ఉంటే ప్రమాదం జరిగేది. ఆమెను స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆమె ఓ యువకుడితో గొడవపడి కాల్వలోకి దూకిందని పలువురు చెబుతుండగా.. బాధితురాలు కడుపునొప్పి తాళలేక దూకినట్లు చెబుతోంది.

మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్‌ఐ


కల్లూరు: పట్టణంలోని పుల్లపుకుంటలో ఐదు రోజుల కిందట గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు ఆదివారం కేసును ఛేదించారు. ఆమెను హత్య చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించారు. కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ రఘు, సీఐ ముత్తు లింగయ్య, ఎస్‌ఐ ఎస్‌కే షాకీర్ వివరాలు వెల్లడించారు. చంద్రుగొండ మండలం ముద్దునూరు గ్రామానికి చెందిన నారాయణపేట నర్సమ్మ (52)ను కల్లూరు మండలం లక్ష్మీపురం (రాళ్లబంజర) గ్రామానికి చెందిన, కరెంట్ పనిచేసే భూక్యా ప్రసాద్ రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ లక్ష్మీపురంలో ఉంటున్నారు. ఏడాది కిందట నెల్లూరు వెళ్లి చల్లాయిపల్లికి చెందిన నెల్లూరు మల్లేశ్వరిని సైతం పెళ్లి చేసుకున్నాడు. దీంతో నర్సమ్మ గొడవ పెట్టింది. మల్లేశ్వరిని వదిలేయాలని, లేకపోతే పంచాయితీ పెట్టి పరువు తీస్తానని బెదిరించడంతో పాటు కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ప్రసాద్, మల్లేశ్వరి కలిసి నర్సమ్మను హతమార్చేందుకు సిద్ధమయ్యారు. రాళ్లబంజర్‌రోడ్‌లోని మామిడి తోటను ఎంచుకుని నర్సమ్మకు ప్రసాద్ ఫోన్ చేసి రప్పించాడు. నర్సమ్మ తలపై ప్రసాద్ కొట్టడంతో కిందపడింది. ప్రసాద్, మల్లేశ్వరి చీరను మెడకు చుట్టి హత్య చేశారు. విచారణలో ఇద్దరూ హత్య చేశారని అంగీకరించారని ఏసీపీ రఘు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు


సదస్సులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ అన్నారు. మమత ఆస్పత్రిలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన టీఎస్ ఎపికాన్ సదస్సు ఆదివారంతో ముగిసింది. చివరి రోజు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త రకాల జబ్బులకు అంతే వేగంతో మందులను కనిపెడుతూ పరిష్కారం చూపుతున్నారన్నారు. టీఎస్ ఎపికాన్ సదస్సుకు రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాను ఎంపిక చేసి మమత ఆస్పత్రిలో నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు. కాగా, పలు రాష్ట్రాలకు చెందిన పీజీ విద్యార్థులు పాల్గొని వైద్యశాస్త్రంలో మెళకువలను నేర్చుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది స్పీకర్లు, ఈసీజీ, వెంటిలేటర్లు వంటి 3 రకాల అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీజీ వైద్యులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. కె.రమేశ్, కన్నెకంటి శివరామకృష్ణ, శ్రీకాంత్, కొల్లు అనుదేవి, పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన ఉద్యోగులు, రిటైర్డ్ కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం : జిల్లాలో 1984లో కానిస్టేబుళ్లుగా ఎంపికైన బ్యాచ్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించా రు. ముఖ్య అతిథిగా డీఎస్పీ రమణమూర్తి హాజరయ్యారు. ఆ బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికైన రమణమూర్తి ఆ తర్వాత డైరెక్ట్ ఎస్సైగా, ప్రస్తుతం డీఎస్పీగా పని చేస్తున్నారు. నాడు 105 మంది ఎంపిక కాగా ప్రస్తుతం 41 మంది విధుల్లో ఉన్నారు. 39 మంది ఉద్యోగ విరమణ పొందగా 25 మంది మృతిచెందారు. కాగా, ఆత్మీయ సమ్మేళనానికి పలు వురు కుటుంబసభ్యులతో సహ హాజరై ఉత్సాహంగా గడిపారు. ఉద్యోగ విరమణ పొందిన వారిని ఘనంగా సత్కరించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి వేడుక జరుపుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, రామచంద్రరావు, రాయప్ప, శ్రీశైలం, రహీమ్, శ్రీనివాసులు, మాదల శ్రీనివాసరావు, పూనాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల బాలుడిపై కుక్క దాడి

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో మూడేళ్ల బాలుడు ధరావత్ కార్తీక్‌పై ఆదివారం కుక్క దాడి చేసింది. ఇంట్లో కుటుంబ సభ్యులు పనుల్లో నిమగ్నమై ఉండగా.. ఆరుబయట ఆడుకుంటున్న బాలుడిపై అటుగా వచ్చిన ఓ వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. సమీపంలో ఉన్న తండ్రి కిషోర్ అప్రమత్తం కావడంతో బాలుడికి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అనంతరం బాలుడిని కొమరారం పీహెచ్‌సీకి, ఆపై ఇల్లెందు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ప్రేమోన్మాది దాడిలో గాయపడ్డ బాలిక మృతి

పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నందుకే ఘాతుకం..


దస్తగిరమ్మ (ఫైల్)

బద్వేలు అర్బన్/కడప కార్పొరేషన్/కడప రూరల్: వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలంలో ప్రేమోన్మాది లైంగిక దాడికి పాల్పడి పెట్రోల్ పోసి నిప్పంటించిన హత్యాయత్నం ఘటనలో తీవ్రగాయాలపాలై కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రొద్దుటూరు దస్తగిరమ్మ (16) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా సాయంత్రం బద్వేలులో అంత్యక్రియలు జరిగాయి. మరోవైపు.. 'నా బిడ్డ లేకలేక పుట్టింది. నిష్కారణంగా ఆమెను తగలబెట్టిన వాడిని నాకు అప్పగించండి'.. అని మృతురాలు దస్తగిరమ్మ తల్లి హుసేనమ్మ డిమాండ్ చేశారు. రిమ్స్ మార్చురీ వద్ద ఆమె మీడియా ఎదుట విలపిస్తూ.. ఉన్నత చదువులు చదివి పైకి ఎదగాల్సిన ఆమెను అన్యాయంగా చంపేసిన వాడిని అలాగే తాను మట్టుబెడతానన్నారు. కాగా, దస్తగిరమ్మ తనను పెళ్లి చేసుకోవాలని తరచూ కోరుతున్నందున, ఆమెను అడ్డుతొలగించుకోడానికే విఘ్నేష్ ఈ హత్యచేశాడని, అతను విచారణలో కూడా ఈ విషయాన్ని ఒప్పుకున్నాడని ఎస్పీ హర్షవర్థన్‌రాజు వెల్లడించారు.

క్లుప్తంగా...

31న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల: శ్రీవారి ఆలయంలో ఈ నెల 31న ఉదయం 'దీపావళి ఆస్థానం'కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఇందులో భాగంగా మలయప్పస్వామి దేవేరులతో కలిసి బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. విష్వక్సేనుల వారినీ స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపు చేసి స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాదాలను నివేదిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని మాడ వీధులలో విహరిస్తారు. ఈ కారణంగా 31న తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనుంది.

ఇదేమి రాజ్యం బాబూ?

ఎక్స్ వేదికగా నిలదీసిన వైఎస్ జగన్ ● శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కారు దారుణ వైఫల్యం



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌లో కాలేజీ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పంటించి ప్రాణాలు తీసిన ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమి రాజ్యం చంద్రబాబూ..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, అరాచక శక్తుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా వైఎస్ జగన్ కూటమి ప్రభుత్వాన్ని ఆదివారం కడిగిపారేశారు.

ఈ దుర్యోధన దుశ్శాసన.. దుర్వినీతి లోకంలో

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడలేకపోతున్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు. ఇదేమి రాజ్యం చంద్రబాబూ? రోజూ ఏదోచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వసాధారణమైపోయాయి. బద్వేలులో కాలేజీ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పు అంటించి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గం. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నా. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం కూడా ఉంది. ఒక పాలకుడు ఉన్నాడంటే ప్రజలు ధైర్యంగా ఉండాల్సిందిపోయి నిరంతరం భయపడే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ మీద కక్షకొద్దీ మా పథకాలను, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం, ప్రజలమీద చంద్రబాబు కక్ష సాధిస్తున్నారు. ఇది అన్యాయం కాదా? వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలు, బాలికల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన విప్లవాత్మక ''దిశ''కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చడం దీనికి నిదర్శనం కాదా? తద్వారా మహిళలు భద్రతను ప్రశ్నార్థకం చేసిన మాట వాస్తవం కాదా? ''దిశ''యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కినా, చేతిలో ఉన్న ఫోన్‌ను ఐదుసార్లు అటూ ఇటూ ఊపినా వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, అక్కడ నుంచి దగ్గర్లో ఉన్న పోలీసులకు సమాచారం వెళ్తుంది. వెంటనే పోలీసులు వారికి ఫోన్ చేస్తారు. ఫోన్ ఎత్తకపోయినా లేదా ఆపదలో ఉన్నట్లు ఫోన్లో చెప్పినా ఘటనాస్థలానికి నిమిషాల్లో చేరుకుని రక్షణ కల్పించే పటిష్ట వ్యవస్థను మీరు (చంద్రబాబు) ఉద్దేశపూర్వకంగా నీరుగార్చలేదా? ''దిశ''ప్రారంభం నుంచి 31,607 మంది మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారు చంద్రబాబూ? 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న 'దిశ'పై రాజకీయ కక్ష ఎందుకు? దిశ కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం. 900 బైక్‌లు, 163 బొలేరో వాహనాలను ''దిశ''కార్యక్రమం కోసమే పోలీసులకు అందించి పెట్రోలింగ్‌ను పటిష్ట పరిచాం. 18 'దిశ'పోలీస్‌స్టేషన్లను నెలకొల్పి 18 క్రైమ్ మేనేజ్‌మెంట్ వాహనాలను సమకూర్చాం. వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశాం. మా హయాంలో శాంతి భద్రతలపై నేను నిర్వహించిన సమీక్షల్లో 'దిశ'కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. దీంతో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేవారు. వీటన్నింటినీ నిర్వీర్యంచేసి ఏం సాధించాలనుకుంటున్నారు చంద్రబాబూ? ఇవాళ మీరు చేస్తున్నదల్లా మహిళల రక్షణ, సాధికారత కోసం అమలవుతున్న కార్యక్రమాలను, స్కీమ్‌లను ఎత్తివేయడం! ఇసుక, లిక్కర్ లాంటి స్కామ్‌లకు పాల్పడుతూ పేకాట క్లబ్బులు నిర్వహించడం! పోలీసు వ్యవస్థ కూడా అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిపక్షంపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధింపులకు దిగడమే పనిగా పెట్టుకుంది. మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణ బాధ్యతలను విస్మరించింది. ఇదేమి రాజ్యం చంద్రబాబూ?.

- బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు
- రాష్ట్రంలో రోజూ ఏదో ఒకచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు
- బద్వేలులో విద్యార్థినిపై పెట్రోలు పోసి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం
- ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం ఉంది
- బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ దిశ యాప్ తెచ్చి 31,607 మందికి రక్షణ కల్పించాం
- + బటన్ నొక్కినా, ఫోన్‌ను ఐదుసార్లు కదిపినా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం.. పోలీసులు నిమిషాల్లో చేరుకునేలా చర్యలు తీసుకున్నాం
- + 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న 'దిశ'పై రాజకీయ కక్ష ఎందుకు?

అంతులేని అఘాయిత్యాలు



ఏపీలో నాలుగు నెలల్లోనే 74 అత్యాచారాలు, లైంగిక వేధింపులు

వీరిలో ఏడుగురు దారుణంగా హత్య
వేధింపులు తట్టుకోలేక ఐదుగురు ఆత్మహత్య

కూటమి పాలనలో హడలిపోతున్న మహిళలు, బాలికలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అక్కడ అబలల ఆర్తనాదాలు.. ఇక్కడ బాబు, బాలకృష్ణ 'ఆహా' ఓహో!

- వరుస అత్యాచారాలు, హత్యలతో ఆంధ్రప్రదేశ్ అల్లకల్లోలం..
- బాలకృష్ణ 'షో' షూటింగ్‌లో ఛిల్ అవుతున్న సీఎం చంద్రబాబు


ప్రోగ్రాంకి హాజరైన సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

తెనాలిలో యువతిపై పెమ్మసాని అనుచరుడి పాశవిక దాడి

- కుమార్తెను బతికించుకునేందుకు ఆస్పత్రుల చుట్టూ తిరిగిన కుటుంబ సభ్యులు
- గుంటూరు సమగ్ర వైద్యశాలలో వెంటిలేటర్‌పై బాధితురాలు


పెమ్మసానితో నిందితుడు నవీన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/తెనాలి రూరల్: టీడీపీకి చెందిన రౌడీషీటర్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడి పాశవిక దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఓ యువతి చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఆదివారం తెనాలిలో ఈ దారుణం చోటు చేసుకుంది. తెనాలి అయితానగర్‌కు చెందిన 26 ఏళ్ల మధిర సహానా ఓ స్పీచ్ అండ్ హియరింగ్ థెరపీ సెంటర్‌లో పనిచేస్తోంది. శనివారం సాయంత్రం డ్యూటీకి వెళ్లిన బాధితురాలిని కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన రౌడీషీటర్ రాగి నవీన్ (కొంతకాలంగా తెనాలిలో నివాసం ఉంటున్నాడు) తన పుట్టిన రోజు అని నమ్మించి వెంట తీసుకువెళ్లాడు. కొద్ది గంటల అనంతరం తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి పరారయ్యాడు. అనంతరం అక్కడకు చేరుకున్న యువతి తల్లిదండ్రులు వైద్యుల సూచనల మేరకు మంగళగిరి, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఎయిమ్స్ సహా పలు ప్రైవేటు వైద్యశాలలకు తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆదివారం తెల్లవారుజామున తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తీసుకురాగా అక్కడి వైద్యులు గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. వెంటిలేటర్‌పై ఉన్న బాధితురాలి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు..

తమ కుమార్తెపై నిందితుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒంటిపై పలు చోట్ల గాయాలున్నాయని.. మెడ, తల కమిలిపోయిందని, దాడి చేసి గాయపర్చినట్లు నల్ల మచ్చలు శరీరంపై ఉన్నాయని బాధితురాలి తల్లి విలపించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈవీఎంల హ్యాకింగ్ చాలా సులభం

▶ మొదటి పేజీ తరువాయి

పెన్సిల్వేనియాలోని ఫిలడెల్ఫియాలో జరిగిన బహిరంగ సభలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

ఈవీఎంల సాఫ్ట్‌వేర్ ఉత్తమం కాదు..

''ఈవీఎంలను చాలా సులభంగా హ్యాక్ చేయవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వం ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌ను ఇకా చాలా తేలిగ్గా హ్యాక్ చేయవచ్చు. నాకు కంప్యూటర్ అంటే ఇష్టం. అయితే కంప్యూటర్లు ఓటింగ్ ట్యాబ్‌లేషన్‌ను కలిగి ఉండకూడదు. ఈవీఎంల్లో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉత్తమమైనది కాదు. ఎన్నికల్లో పేపరు బ్యాలెట్లు మాత్రమే ఉపయోగించాలి. ప్రతి వ్యక్తి నేరుగా పోలింగ్ బూత్ వద్దకు వచ్చి లైన్‌లో నిలబడి ఓటింగ్ హక్కు వినియోగించుకోవాలి''అని మస్క్ పేర్కొన్నారు. ఈవీఎంల ద్వారా భారత్‌లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజాగా ఎలన్ మస్క్ వ్యాఖలు మరోసారి చర్చకు దారి తీశాయి. ఈవీఎంల ద్వారా కాకుండా పారదర్శకత కోసం బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సైతం డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

ఓ అభ్యర్థి గెలిచేలా రీ ప్రోగ్రామింగ్ చేయవచ్చు

ఈవీఎంల పనితీరుపై ఎలన్ మస్క్ తొలి నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈవీఎంలో కాలం చెల్లిన మైక్రోసాఫ్ట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారని, దీంతో వీటిని హ్యాక్ చేయడం అత్యంత సులభమని, ఈ విషయాన్ని ఒక టెక్నాలజీ నిపుణుడిగా చెబుతున్నట్లు జూలైలో మస్క్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. 2017లో సెనేట్ ఇంటెలిజెన్స్ విచారణలో ఈ విషయం బయటపడిందని, ఓ అభ్యర్థి గెలిచే విధంగా ఓట్లను దొంగిలిస్తూ ఈవీఎంలను రీ ప్రోగ్రామింగ్ చేయవచ్చని స్పష్టం చేశారు. అమెరికా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సహా మరే విధంగానూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతిని వినియోగించకూడదని మస్క్ గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా వార్తలు

డీజే మోత.. గుండెకు వాత..

ఈవెంట్ ఏదైనా డీజే తప్పనిసరి

- పబ్బుల నుంచి పల్లెలకు విస్తరించిన సంస్కృతి
- పరిమితికి మించి శబ్దాలతో హాని తప్పదంటున్న వైద్యులు
- హెచ్చరికలు, ప్రకటనలకే పరిమితమవుతున్న పోలీసులు


డిస్క్ జాక్ (డీజే) సౌండ్ సిస్టమ్


డీజే సౌండ్ సిస్టమ్ వద్ద నృత్యం చేస్తున్న యువత

ఇల్లెందురూరల్: సంప్రదాయ డప్పు చప్పుళ్ల స్థానాన్ని నేడు డీజే (డిస్క్ జాక్)లు ఆక్రమించాయి. ఇష్టమైన పాటలను మరింత ఊపొచ్చేలా వినిపించేందుకు ఇందులో సౌలభ్యం ఉండటంతో కుర్రకారు అమితంగా ఇష్టపడుతున్నారు. దీంతో పెళ్లి, దేవతా మండపాలు, ఊరేగింపులు ఇలా ఎక్కడ చూసినా డీజే మోతలు హోరెత్తిస్తున్నాయి. యువతను ఇంతగా ఆకట్టుకున్న డీజే శబ్దాలతో ఆనందం ఎంత ఉందో అంతకు మించి నాలుగు రెట్లు ప్రమాదం కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఇబ్బంది కలిగితే మాకేంటి?

మహానగరాల్లో డీజే ట్రెండ్ చాన్నాళ్లుగా ఉంది. పట్టణాల్లోని పబ్బుల్లో, క్లబ్బుల్లో మాత్రమే కనిపించిన డీజే సంస్కృతి ఇప్పుడు పల్లెటూళ్లకూ చేరింది. పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు.. ఇలా ఏ ఈవెంటైనా డీజే ఏర్పాటు చేయడం.. కుర్రకారు డాన్స్ చేయడం ఆనవాయితీగా మారింది. దీనికి తోడు టపాసుల మోత తప్పనిసరైంది. ఇలా రణగొణ శబ్దాలు కొందరికి ఆనందాన్ని కలిగిస్తున్నా.. చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలుగుతుందనే విషయాన్ని ఎవరూ గుర్తించడం లేదు. ఇక దేవతామూర్తుల శోభాయాత్రల సమయాన మంగళప్రదమైన వాయిద్యాలకు బదులు డీజేలు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.

ప్రయోజనమా.. హానికరమా..

సాధారణంగా మనం వినగలిగే శబ్దం 40 నుంచి 50 డెసిబుల్స్ మాత్రమే. కానీ డీజే శబ్ద తీవ్రత 100 నుంచి 120 డెసిబుల్స్ ఉంటుంది. ఇలా శబ్దాన్ని గంటల తరబడి వింటే మనిషికి చెవిపోటు వస్తుంది. ఈ ధ్వని గుండెకు అనుసంధానమై ఉన్న కర్ణికను ప్రేరేపించి గుండెపోటుకు దారితీస్తుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాక శబ్ద కాలుష్యం వల్ల ధమనుల్లో అధిక రక్తపోటుకు దారితీస్తుందని, గుండెపై ఒత్తిడి పెరిగి గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం లేకపోలేదని సూచిస్తున్నారు.

చట్టం ఏం చెబుతోందంటే..

సుప్రీం కోర్టు శబ్ద కాలుష్యం నియంత్రణ కోసం గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. సౌండ్ పొల్యూషన్ రెగ్యులేషన్ ఆఫ్ రూల్స్ 2000 ప్రకారం.. నివాస ప్రాంతాల్లో పగలు 55 డెసిబుల్స్, రాత్రి 45 డెసిబుల్స్, కమర్షియల్ ప్రాంతాల్లోనైతే పగలు 65 డెసిబుల్స్, రాత్రి 55 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో పగలు 75 డెసిబుల్స్, రాత్రి 70 డెసిబుల్స్ దాటొద్దు. ఇక విద్యాసంస్థలు, ఆస్పత్రులు వంటి ప్రాంతాలను సైలెంట్ జోన్‌గా పాటించాలి. ఇలాంటి జాగ్రత్తలతో ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేలా సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్లపై నిషేధం విధించింది. పండుగలు, వివాహాలు, శోభాయాత్రలు వంటి సందర్భాల్లో లౌడ్ స్పీకర్లు, డీజేలు అనుమతించినా శబ్ద పరిమితి పాటించాలని సూచించింది.

ప్రకటనలతోనే సరి..

శబ్ద కాలుష్యంపై సుప్రీం కోర్టు ఆదేశాల అమలును ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. పోలీస్ యంత్రాంగం సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు లేకపోలేదు. అనుమతుల పేరుతో అనేకచోట్ల నియమావళి ఉల్లంఘనే కనిపిస్తోంది. అర్ధరాత్రి డీజే మోతల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నా, ఫిర్యాదు చేస్తున్నా తమకు పట్టనట్లుగా పోలీస్ యంత్రాంగం వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

అధిక శబ్దాలతో అనర్థం



అధిక శబ్దాలు అనర్థానికి దారి తీస్తాయి. డీజే శబ్దాలు మరీ ప్రమాదకరం. ఈ శబ్దాలను దగ్గరగా వింటే చెవులు, గుండె సంబంధిత సమస్యలు వస్తాయి. ఒక్కోసారి గుండెపోటు కూడా రావొచ్చు. 70కి మించి డెసిబుల్ తీవ్రత కలిగిన శబ్దాలకు దూరంగా ఉండటం ఆరోగ్యకరం.

–డాక్టర్ కవిత, వైద్యాధికారి, రొంపేడు పీహెచ్‌సీ

కఠిన చర్యలు తీసుకుంటాం..



పండుగల సమయాన అనుమతి కోరిన వారికి ఆంక్షలతో అంగీకారం తెలిపాం. ఈ సాకుతో అర్ధరాత్రి వరకు భారీ శబ్దాలతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించం. సాధారణ రోజులలో ఎవరు డీజే వినియోగించినా డయల్ 100కు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం.

–చంద్రభాను, డీఎస్పీ, ఇల్లెందు సబ్ డివిజన్

ఈ రకాలు అయితేనే...

- రూ.500 బోనస్‌కు సన్న వరి రకాల ప్రకటన
- ధాన్యం పొడవు, వెడల్పుల ఆధారంగా గుర్తింపు
- 30 రకాలను వెల్లడించిన ప్రభుత్వం



ఖమ్మంవ్యవసాయం: వరి పంట సీజన్ ప్రారంభమవుతున్న వేళ పంట ధర, ప్రభుత్వం అందించే బోనస్ అంశాలపై అన్నదాతల్లో చర్చ జరుగుతోంది. శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరి సన్న రకాలకు ధరతో పాటు క్వింటాల్ ధాన్యానికి మరో రూ.500 బోనస్ అదనంగా ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సన్న రకాలకు రూ. 500 చెల్లించే బోనస్‌పై మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు బోనస్ చెల్లించే వరి రకాల వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో మొత్తం 2,81,991 ఎకరాల్లో వరి సాగు చేయగా, దీనిలో సన్న రకాలు 2,62,230 ఎకరాల్లో పండిస్తున్నారు. లావు రకాలు కేవలం 19,761 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర వరి గ్రేడ్ ఏ రకానికి రూ. 2,320, సాధారణ రకానికి రూ.2,300 నిర్ణయించింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాలకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ అదనంగా రూ.500 చెల్లించనుంది. జిల్లాలో 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, పలు ప్రాంతాల్లో ఇప్పటికే ప్రారంభమయ్యాయి. సన్న రకాలను కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా 267 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

మైక్రో మీటర్ల ద్వారా గుర్తింపు

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మైక్రో మీటర్లను ఏర్పాటు చేసి సన్న రకాలను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మైక్రో మీటర్ ధాన్యం పొడవు, వెడల్పులను గుర్తిస్తుంది. దీని ఆధారంగా వరి సన్నరకమా..? లావు రకమా గుర్తించవచ్చు. పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. మీటర్ల కంటే ఎక్కువ గాకుండా ఉంటే వాటిని సన్న రకంగా పరిగణిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రూ.500 బోనస్‌కు అర్హత ఉన్న సన్న రకాలు

ధాన్యం పొడవు, వెడల్పు కొలతల ఆధారంగా ప్రభుత్వం 33 వరి రకాలను సన్న ధాన్యంగా గుర్తించింది. రూ.500 బోనస్‌కు అర్హత సాధించిన వరి సన్న రకాల్లో సిద్ధి(డబ్ల్యూజీఎల్ 44), కంపాసాగర్ వరి-1(కేపీఎస్ 2874), సాంబ మసూరి(బీపీటీ 5204), జగిత్యాల వరి-3(జేజీఎల్ 27356), జగిత్యాల వరి-2(జేజీఎల్ 28545), వరంగల్ సాంబ(డబ్ల్యూజీఎల్ 14), వరంగల్ సన్నాలు(డబ్ల్యూజీఎల్ 32100), జగిత్యాల మసూరి(జేజీఎల్ 11470), పోలాస ప్రభ(జేజీఎల్ 384), క్రిష్ణ(ఆర్ఎన్ఆర్ 2458), మానేరు సోన(జేజీఎల్ 3828), తెలంగాణ సోన(ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2(కెఎన్ఎం 1638), వరంగల్ వరి-2(డబ్ల్యూజీఎల్ 962), రాజేంద్రనగర్ వరి-4(ఆర్ఎన్ఆర్ 21278), కూనారం వరి-1(కేఎన్ఎం 733), జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798), జగిత్యాల సాంబ(జేజీఎల్ 3844), కరీంనగర్ సాంబ(జేజీఎల్ 3855), అంజన(జేజీఎల్ 11118), నెల్లూరి మసూరి(ఎన్ఎల్ఆర్ 34449), ప్రత్యుమ్న(జేజీఎల్ 17004), సుగంధ సాంబ(ఆర్ఎన్ఆర్ 2465), శోభిని(ఆర్ఎన్ఆర్ 2354), సోమ్‌నాథ్(డబ్లూయజీఎల్ 347), ఆర్ఎన్ఆర్ 31479(పీఆర్‌సీ), కేపీఎస్ 6251(పీఆర్‌సీ), జేజీఎల్ 33124(పీఆర్‌సీ), హెచ్ఎంటీ సోన, మార్టేరు సాంబ(యంటీయూ 1224), మార్టేరు మసూరి(యంటీయూ 1262), యంటీయూ 1271 రకాలు ఉన్నాయి.

డ్యూటీమీట్‌లో ఎస్సైకి కాంస్య పతకం


పతకం అందుకుంటున్న ఎస్‌ఐ స్వప్న


చండ్రుగొండ: హైదరాబాద్ పోలీస్ అకాడమీలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్యూటీమీట్‌లో చండ్రుగొండ ఎస్‌ఐ గంజి స్వప్న ఫింగర్ ప్రింట్ కేటగిరీలో కాంస్య పతకం సాధించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మోహంతి చేతుల మీదుగా ఆమె పతకం అందుకున్నారు. స్వప్న ప్రతిభను గుర్తించిన శాఖాధికారులు.. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన రీజినల్ స్థాయి పోటీల్లోనూ స్వప్న రెండు పతకాలు సాధించి ఉన్నతాధికారులతో శెభాష్ అనిపించుకున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఎస్‌ఐని పలువురు అభినందించారు.

హెచ్చరిక బోర్డులెక్కడ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో గోదావరి స్నానఘట్టాల వద్ద లోతును తెలిపేలా హెచ్చరిక బోర్డులు కరువయ్యాయి. బోర్డులు ఏర్పాటు చేయకున్నా కనీసం సూచనలు చేసేందుకు సిబ్బంది కూడా కానరావడం లేదు. భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. సెలవు రోజుల్లో రద్దీ మరింతగా ఉంటుంది. భక్తులంతా రామయ్య దర్శనానికి ముందు గోదావరిలో స్నానమాచరించడం ఆనవాయితీ. అయితే, స్నానఘట్టాల లోతును తెలియజేసే బోర్డులు కానీ కంచె కానీ లేకపోవడంతో భక్తులు లోపలికి వెళ్తున్నారు. శుక్రవారం ఇల్లెందుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గోదావరిలో గల్లంతవుండగా స్థానిక ఫొటోగ్రాఫర్ గమనించి రక్షించాడు. శనివారం ఇద్దరు వ్యక్తులు గల్లంతవుతుండగా గజ ఈతగాడు ప్రసాద్ రక్షించాడు. నాలుగు రోజులుగా నిత్యం గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లి రోజూ ఎవరో ఒకరు గల్లంతవుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని భక్తులు వాపోతున్నారు. మరో పది రోజుల్లో కార్తీకమాసం ప్రారంభం కానుంది. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగక ముందే స్నానఘట్టాలు, గోదావరి కరకట్ట పరీవాహక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.


గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులు

కేంద్రమంత్రికి వినతి


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వినోద్‌రావు

ఖమ్మంమామిళ్లగూడెం/చుంచుపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ గ్రామంలోని సింగభూపాలెం చెరువుతోపాటు ఖమ్మం జిల్లాలోని ఖమ్మం స్తంభాద్రి గుట్ట లక్ష్మీనర్సింహస్వామి, జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాలను అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు కోరారు. ఆదివారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ట్రావెల్ ట్రేడ్ అసోసియేషన్లను ఉపయోగించుకోవటం ద్వారా ఆ పరిసర ప్రాంత ప్రజల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయొచ్చని, ఉద్యోగ అవకాశాలు సృష్టించవచ్చని కేంద్ర మంత్రికి వివరించారు.

కిన్నెరసానిలో కోలాహలం

- భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- ఒకరోజు ఆదాయం రూ.27,920


జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 350 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.12,360 ఆదాయం లభించగా, 260 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.15,560 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.